# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 46 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | సోమవారం 07 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 46 07-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




'ఫార్మా'లో విషవాయువు లీక్.. కార్మికుడు మృతి

3లో

# గ్రోత్ రేట్ టాప్ లిస్ట్‌లో ఆంధ్రప్రదేశ్



అమరావతి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలో గ్రోత్ రేట్ రాష్ట్రాల్లో టాప్ లిస్ట్ లోకి ఆంధ్రప్రదేశ్ వచ్చింది.. 2024-25 సంవత్సరానికి గ్రోత్ రేట్ లో రెండవ స్థానంలో ఏపీ నిలిచింది ..కాన్ స్టెంట్ ప్రైసెస్ లో 8.21 శాతం గ్రోత్ రేట్ తో దేశంలో రెండో స్థానంలో ఏపీ.. 9.69 శాతం గ్రోత్ రేట్ తో దేశంలో మొదటి స్థానంలో తమిళనాడు.. ఆంధ్రప్రదేశ్ గ్రోత్ రేట్ ను నిర్ధారిస్తూ సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ నివేదిక విడుదల చేసింది. ఇక, ఏడాది కాలంలో 2.02 శాతం పెరిగి 8.21 శాతంగా నమోదు అయింది. కరెంట్ ప్రైసెస్ విభాగంలో 12.02 శాతంగా ఎపి గ్రోత్ రేట్.. ఏపీ వృద్ధిరేటు దేశంలో రెండో స్థానానికి చేరడంపై ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్ అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రం గాడిన పడడంతో పాటు కాన్ఫిడెన్స్ పెంచేలా వృద్ధి రేటు సాధించామన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, ఇంధన రంగం సహా పలు రంగాల్లో తీసుకొచ్చిన పాలసీలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వెల్లడించారు. గ్రోత్ రేట్ వృద్ధి రాష్ట్ర ప్రజల సమిష్టి విజయం అంటూ అభినందనలు తెలిపారు. బంగారు భవిష్యత్ కోసం కలిసి ప్రయాణాన్ని కొనసాగిద్దామని రాష్ట్ర ప్రజలకు సీఎం పిలుపునిచ్చారు.



## భద్రాచలంలో కమనీయంగా.. సీతారాముల కల్యాణం...

- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- నేడు శ్రీరామనవమి
- సతీసమేతంగా భద్రాద్రికి తరలివచ్చిన సీఎం రేవంత్ రెడ్డి
- రామ నామ స్మరణతో మార్మోగిన భద్రాద్రి
- వైభవంగా సీతారాముల కల్యాణం
- తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు



హైదరాబాద్ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేలాది భక్తుల


- తరువాయి 2లో..

## ఆక్వా రంగాన్ని ఆదుకోండి

**సుంకాల నుంచి రొయ్యలకు మినహాయింపు కోరండి**

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు సిఎం చంద్రబాబు లేఖ**

అమరావతి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



అమెరికా విధించిన సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వా రంగానికి అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్‌కు సిఎం ఆదివారం లేఖ రాశారు. సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులకు మినహాయింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశం నుంచి ఎగుమతి అయ్యే సముద్ర ఆహార ఉత్పత్తులపై అమెరికా 27 శాతం దిగుమతి సుంకం విధించిందని తెలిపారు. 2023-24లో


- తరువాయి 2లో..

## ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్ నిర్మాణం కోసం త్వరలో టెండర్లు

అమరావతి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మీదుగా వెళ్లే ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్ నిర్మాణం కోసం త్వరలో టెండర్లు పిలవనున్నారు. భూసేకరణ కొంతమేర కొలిక్కి వచ్చింది. ఈ

- తరువాయి 2లో..



## మోదీ అమరావతి పర్యటనకు ఏర్పాట్లు

అమరావతి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ రాజధాని అమరావతి పర్యటనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి మోదీ ఈ నెల మూడో వారంలో రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వెలగపూడి సమీపంలోని సచివాలయం వెనుక ఉన్న 250 ఎకరాల్లో

- తరువాయి 2లో..





## ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఒంటిమిట్ట, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ లోని ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయం వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభ మయ్యాయి. దీనిలో భాగంగా నేటి ఉదయం 9.30 నుండి 10.15

- తరువాయి 2లో..




## శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా

తిరుమల, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొదటిసారిగా తిరుమలకు విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో జె.శ్యామల రావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు మేళతాళాల మధ్య వేద మంత్రాలు నడుమ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సంప్రదాయబద్ధంగా ఇష్ఠికఫాల్ స్వాగతం పలికారు.స్వామివారి దర్శనం తరువాత భారత ప్రధాన న్యాయమూర్తి ని అర్చకులు శేష వస్త్రం కప్పిన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అటు తరువాత టీటీడీ ఈవో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్ ఛార్జ్ సీవీఎస్వో హర్షవర్ధన్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు చిరుత చిక్కిందయ్యా..!

తిరుమల, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



**వామ్మో.. అదిగో చిరుత పులి.. ఇప్పుడే కనిపించింది.. అటువైపు వెళ్లింది.. మళ్లీ వచ్చింది.. ఇలా ఓ చిరుత కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.. కొన్ని నెలలుగా ఎస్వీ వేదిక్ వర్సిటీల దగ్గర చిరుత సంచారంతో అటు విద్యార్థులు, ఇటు స్థానికులు గజగజ వణికిపోతున్నారు.. ఈ క్రమంలో.. తిరుపతి ఎస్వీ వేదిక్ యూనివర్సిటీని భయపెడుతున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. దీంతో అంతా ఎస్వీ అధికారులు, విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు.**

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో కొన్ని నెలలుగా చిరుత సంచారం కలకలం రేపుతోంది. దాంతో.. చిరుతను బంధించేందుకు ఫారెస్ట్ అధికారులు నాలుగు ప్రాంతాల్లో బోనులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే.. చిరుతపులి ఓ బోనులో చిక్కింది.

ఆడ చిరుతగా గుర్తించిన అటవీశాఖ అధికారులు.. కడప జిల్లా చిట్వేలు అటవీ ప్రాంతంలో

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## వైఫల్యాల వెనుక వ్యవస్థ లోపాలు!

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో పెద్ద మొత్తంలో అక్రమ నగదు కనిపించినట్లు గత వారం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' బయట పెట్టింది. అంతకు మునుపు, జస్టిస్ శేఖర్ యాదవ్ న్యాయవ్యవస్థ గౌరవప్రతిష్ఠలకు భంగం కలిగిస్తూ మాట్లాడారు. భారతదేశం మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తోందని జస్టిస్ శేఖర్ యాదవ్ గత డిసెంబరులో ఒక ప్రైవేటు కార్యక్రమంలో అనడం వివాదాస్పదమయింది. అప్పుడు ఆయనపై సరైన చర్యలు తీసుకోలేదు.

ఇప్పుడీ రెండో కేసులో అంతటా నిరసన పెల్లుబుకటంతో ఆలస్యంగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతోంది. న్యాయవ్యవస్థ స్పందనలు అర్థవంతంగా, బాధ్యతాయుతంగా ఉంటున్నాయా? లేవని సమా ధానం చెప్పుకునేటట్లయితే, జ్యుడీషియరీ జవాబుదారీతనం కోసం పనిచేయాల్సిన అంతర్గత విచారణ యంత్రాంగం ఏం చేస్తున్నట్లు? ఇక న్యాయమూర్తుల ఎంపిక విధానం ఈ పరిస్థితికి దారి తీసిన రెండో సమస్య. హైకోర్టు స్థాయిలో జరిగే నియామకాల తీరు మరీ ఆందోళన కలిగిస్తోంది.

న్యాయవ్యవస్థ జవాబుదారీతనాన్ని కాపాడవలసిన అంతర్గత యంత్రాంగం (ఇన్%-%హౌస్ మెకానిజం) గుణదోషాల్ని జస్టిస్ అజిత్ ప్రకాష్ షా 'రోసలిండ్ విల్సన్ స్మారక ఉపన్యాసం'లో తీవ్రాతి తీవ్రంగా విమర్శించారు. ఇది 2019 నాటిదైనా నేటి సందర్భానికి అతికినట్లు సరిపోతుంది.

మొట్టమొదటగా అంతర్గత వ్యవస్థ స్వభావం మీద ఆయన అస్త్రం ఎక్కుపెట్టారు. అది అనుసరించే పద్ధతులు ఎప్పటికప్పుడు తాత్కాలికంగా, ఇష్టాగోష్ఠిలా ఉంటాయి. "ఈ ప్రొసీజర్‌కు ఎలాంటి చట్టబద్ధ ప్రాతిపదిక లేదు". " న్యాయ వ్యవస్థ లోపల దానికి ఉన్న మన్నన పరిమితం". "ఇందుకు నిదర్శనం %-% కమిటీ నివేదిక వ్యతిరేకంగా వచ్చిందని చెప్పి రాజీనామాకు సిద్ధపడిన న్యాయమూర్తి ఒక్క రంటే ఒక్కరూ లేకపోవటం..." అని ఆయన అంటారు.

"న్యాయవ్యవస్థ దానికదే ఒక చట్టం, ఒక ప్రపంచం" అన్నట్లు అంతర్గత యంత్రాంగం పరిగణిస్తుందని జస్టిస్ షా మరీ ముఖ్యంగా ప్రస్తావించారు. వారిని వారే నియమించుకుంటారు. తమ ప్రవర్త నను నియంత్రించే విధివిధానాలను వారే అంతర్గతంగా రూపొందించుకుంటారు. ఇది "ఒక తరహా స్వీయపాలన" అంటూ, "ఏలాగైతే ఉండాలో కచ్చితంగా అందుకు భిన్నంగా ఉంది.." అని విమర్శించారు.

అంతర్గత యంత్రాంగం వాస్తవ పనితీరు ఎలా ఉంటుందో తెలిపేందుకు పలు విమర్శలు ఉన్నాయి. న్యాయమూర్తుల నడత గురించి బహిరంగంగా చెప్పుకున్న సందర్భాలు చాలానే ఉన్నా, వారిపై ఇన్%-%హౌస్ విచారణలు ఏనాడూ జరగలేదు. అలాగే, జడ్జీల మీద నిర్దిష్ట ఆరోపణలు చేసిన కేసుల్లోనూ అంతర్గత విచారణకు ఆదేశాలు లేవు.

న్యాయవ్యవస్థ జవాబుదారీతనం కోసం తటస్థమైన, అధికా రికమైన, చట్టబద్ధ యంత్రాంగం ఒకటి ఎందుకు ఉండాలో జస్టిస్ షా తీవ్ర పదజాలంతో వివరించారు. "న్యాయపీఠం మీద కూర్చున్న క్షణం నుంచీ వారి ప్రవర్తన ఎలా ఉండాలో నిర్దేశించే నైతిక వర్తన నియమావళి న్యాయమూర్తులకు మనసుల్లో పాతుకుపోయి ఉండాలి.

కాని అలా ఉండదు. కచ్చితంగా చెప్పాలంటే, వారు తమ ముందుండే లాయర్లు, వాదులు, ప్రతివాదులు, నేరస్థులు, సాక్షులు, పోలీసుల మాదిరిగానే ఫక్తు సాధారణ మానవులు. వారు నిర్వహించే పదవుల స్వభావాన్ని బట్టి వారికి నైతికతను ఆపాదిస్తే అది మోసం, ప్రమాదకరం..." అన్నారు. న్యాయమూర్తుల నడత, ప్రవర్తన గురించి మాట్లాడుకుంటు న్నాం కాబట్టి, వారి ఎంపిక విధానం గురించిన ప్రశ్న తలెత్తక మానదు. కొలీజియం వ్యవస్థ పరిపూర్ణంగా పనిచేయడం లేదన డంలో సందేహం లేదు. మనకు వేరొక విధానం కావాలి. దాని గురించి మాట్లాడుకునే ముందు, ప్రస్తుత కొలీజియం వ్యవస్థ ఎక్కడ విఫలమైందో చూద్దాం.

జస్టిస్ షాతో నేను ఈ విషయం మాట్లాడినప్పుడు, ఆయన పలు అంశాలు చెప్పారు. మొదటిది %-% జడ్జీలను ఎంపిక చేయడానికి ఇవీ అంటూ చెప్పగలిగిన ఆమోదిత ప్రమాణాలేవీ లేవు. అంతా "అడ్ హాక్"గా ఉన్నట్లు ఉంటుంది. నోటిమాట చెల్లుబాటు అవుతుంది. తరచూ ఇష్టులకే పెద్దపీట వేస్తారు.

ఎంపికల్లో అత్యుత్తములను నిర్లక్ష్యం చేయడం కూడా పరిపాటి. ఇది మరీ ఆందోళనకరం. కొట్టొచ్చినట్లు కనబడే రెండు ఉదాహ రణలు జస్టిస్ షా చెప్పారు. జస్టిస్ అకిల్ ఖురేషీ, జస్టిస్ మురళీధర్‌లు సుప్రీం కోర్టులో స్థానం పొందలేకపోయారని, సుప్రీంలో ప్రవేశించ డానికి వారు పూర్తిగా అర్హులని ఆయన విశ్వసిస్తారు.

ఎంపిక ప్రక్రియ నుంచి ప్రభుత్వాన్ని దూరం పెట్టడానికి కొలీజియం వ్యవస్థ రూపొందింది. అయినప్పటికీ ప్రభుత్వం తాను చేయగలిగినంతా చేయగలదు. పార్లమెంటులో మంచి మెజారిటీ ఉన్న ప్రభుత్వం కొలీజియం సిఫారసులను తొక్కిపట్టగలదు. అంటే ఏదైతే జరగకూడదన్న భావనతో కొలీజియం ఏర్పడిందో దొడ్డిదారిన అదే జరుగుతోంది.

ఏమైనప్పటికీ, హైకోర్టు జడ్జీల నియామక స్థాయిలో కొలీజియం వ్యవస్థ అత్యంత బలహీనమైనదని భావించాలి. ఇది ఆందోళనకర పరిస్థితి. ఎందుకంటే, సుప్రీంకోర్టులో బహుశా 95 శాతం మంది న్యాయమూర్తులు హైకోర్టు జ్యుడీషియరీ నుంచే ఎంపిక అవుతారు. హైకోర్టు జడ్జీల నియామకాలు లోపభూయిష్ఠంగా ఉన్నప్పుడు ఆ ప్రభావం సుప్రీం కోర్టు మీదా పడుతుంది.

చివరగా, మనం చర్చించిన రెండు సమస్యలూ... అంతర్గత యంత్రాంగం, నియామక విధానం... ఏమాత్రం అలక్ష్యం చేయదగి నవి కావు. ఈ అలక్ష్యం మన న్యాయవ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది. వాస్తవానికి వీటికి దేనికదిగా కాకుండా, రెంటికీ కలిపి పరిష్కారం ఆలోచించాలి. పాలక, న్యాయ వ్యవస్థల పరస్పర సహకారంతోనే ఇది సాధ్యమవుతుంది. మరి ఇందుకు అవి సిద్ధంగా

# శ్రీశైలంలో సీతా రామచంద్రుల కల్యాణం

**శ్రీశైలం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నంద్యాల జిల్లాలోని ప్రముఖ జ్యోతిర్లింగం పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని క్షేత్రపరిధిలో శ్రీశైల దేవస్థానం అనుబంధ దేవాలయాల్లో శ్రీ ప్రసన్న అంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని రామాలయంలో శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవోపేతంగా జరిపించారు. ఈ ఉత్సవాన్నిపురస్కరించుకొని ఉదయం సీతారాములవారికి, ఆంజనేయస్వామి వారికి ఆలయ అర్చక,వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో విశేషపూజలు జరిపించారు. లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించి తదుపరి కళ్యాణోత్సవం నిర్విఘ్నంగా జరగాలని ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాగణపతి పూజను నిర్వహించి, కంకణం పూజ, కంకణం ధారణ, యజ్ఞోపవితధారణ,నూతన వస్త్రసమర్పణ,వరపూజ, ప్రవర పఠన,గౌరిపూజ, మాంగల్యపూజ,శ్రీ సీతాదేవి వారికి మాంగళ్య ధారణ తలంబ్రాలు మొదలైన కార్యక్రమాలతో సాంప్రదాయ పద్ధతిలో సీతారాముల కల్యాణం జరిపించరు. సీతారాముల కళ్యాణ మహోత్సవం తరువాత దేవాలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కన్నుల పండుగ జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు, పలువురు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



## భద్రాచలంలో కమనీయంగా..
## సీతారాముల కల్యాణం...









సమక్షంలో సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరై సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది. కాగా, భద్రాచలంలోని మిథిలా మైదానంలో సీతారాముల కల్యాణ వేడుకకు వేదికగా నిలిచింది. అభిజిత్ లగ్నంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీరామచంద్రమూర్తి సీతమ్మ మెడలో మాంగల్యధారణ చేశారు. ఈ వేడుకకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం 9 గంటలకు కల్యాణ క్రతువు ప్రారంభం కాగా, 10 గంటల సమయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మిథిలా కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. కల్యాణానికి మూడు నెలల ముందే గోటితో ఒలిచిన తలంబ్రాలను దేవాలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. సీతమ్మకు ధరింపజేసే మంగళసూత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడు పోగులు కలిగిన ఈ మంగళసూత్రంలో ఒకటి సీతమ్మ పుట్టింటి వారిది కాగా, మరొకటి అత్తగారింటి వారిది. మూడవ పోగును భక్త రామదాసు తయారు చేయించారు. కల్యాణ ముహూర్త సమయం 12.02 నిమిషాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ జీలకర్ర బెల్లంను అద్దారు. ఆ తరువాత మాంగల్యధారణ మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. భక్తుల రామ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. సీతారాముల కల్యాణ ఘట్టం 12.40 నిమిషాలకు వైభవంగా ముగిసింది. ఈ వేడుకను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేసవి వేడిని సైతం లెక్కచేయకుండా భక్తులు తరలిరావడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సీతారాముల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అటు, ప్రతి సంవత్సరము టీటీడీ తరుపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తుంది. ఈ సందర్భంగా ముందుగా భద్రాచలం ఆలయం వద్దకు సతీసమేతంగా చేరుకున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం టీటీడీ ఛైర్మన్ దంపతులు సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు.

## ఆక్వా రంగాన్ని ఆదుకోండి

దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని, వీటిలో 92 శాతం రొయ్యలేనన్నారు. అమెరికా విధించిన సుంకాల కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతుందని తెలిపారు. ఈక్వెడార్ వంటి దేశాల ఎగుమతులపై కేవలం 10 శాతం పన్ను అమెరికా విధిస్తుందని, ఇది మన దేశానికి నష్టం కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటికే మన ఎగుమతిదారులు 5.77 శాతం కౌంటర్ వెయిలింగ్ సుంకం భారాన్ని మోస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 5 నుంచి కొత్త సుంకాలు అమలులోకి రావడంతో అమెరికాకు వెళ్లే అన్ని ఎగుమతులపై భారం పడుతోందన్నారు. మరోవైపు యూరోపియన్ యూనియన్‌లో మన ఎగుమతిదారులు 50 శాతం తనిఖీ రేటు, 4 నుంచి 7 శాతం దిగుమతి సుంకాలతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అమెరికా సుంకాల ఫలితంగా ఎగుమతులు నిలిచిపోవడం, శీతల గిడ్డంగులు ఇప్పటికే ఉత్పత్తులతో నిండిపోవడం, చేతికొచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో తెలియక రైతులు గందరగోళానికి గురువుతున్నారని తెలిపారు. సుంకాల కారణంగా పండిన పంట సేకరించడాన్ని ఎగుమతిదారులు నిలిపివేశారని పేర్కొన్నారు. ఈ పరిణామాలు మొత్తం ఆక్వా రంగాన్నే సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని తెలిపారు. ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు అన్ని వర్గాలకు సమస్యలు వచ్చాయని చెప్పారు. అమెరికా సుంకాల నుంచి రొయ్యలకు మినహాయింపు ఇచ్చేందుకు చర్చలు జరపాలని కేంద్ర మంత్రిని ఈ సందర్భంగా సిఎం కోరారు. సకాలంలో జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించడం వల్ల ఆక్వారంగంపై ఆధారపడి ఉన్న లక్షలాది మంది జీవనోపాధిని కాపాడొచ్చని చెప్పారు.


## ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్ నిర్మాణం కోసం త్వరలో టెండర్లు

నేపథ్యంలో రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ సమాయత్తమవుతోంది. తొలుత 27 కిలోమీటర్ల ట్రాక్‌తోపాటు కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి మరో రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నట్టు తెలుస్తోంది. కాజీపేట-విజయవాడ లైన్‌లోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి మొదలయ్యే ఈ రైల్వే లైన్ అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వద్ద విజయవాడ-గుంటూరు లైన్‌లో కలుస్తుంది. ఈ రైల్వే లైన్ మొత్తం పొడవు 57 కిలోమీటర్లు. 27 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 450 కోట్లు, కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల వంతెన నిర్మాణానికి రూ.350 కోట్లు ఖర్చవుతాయని ప్రాథమిక అంచనా. వచ్చే మూడేళ్లలో ఈ పనులు పూర్తిచేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, రెండేళ్లలోనే పూర్తిచేయాలని రైల్వేశాఖను చంద్రబాబు కోరారు. ట్రాక్ నిర్మాణం రెండేళ్లలో పూర్తవుతుందని, కానీ, వంతెన నిర్మాణానికి మూడేళ్లు పడుతుందని రైల్వేశాఖ చెబుతోంది. అలాగే, అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణానికి కూడా టెండర్లు పిలుస్తారు. సీఆర్‌డీఏ పరిధిలోని తాడికొండ ప్రాంతంలో రైల్వే లైన్‌కు భూములిచ్చేందుకు రైతులు అభ్యంతరం చెబుతుండటంతో అమరావతి నుంచి నంబూరు వరకు 26.5 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు మాత్రం కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

## మోదీ అమరావతి పర్యటనకు ఏర్పాట్లు

కార్యక్రమం నిర్వహించేందుకు పనులు ప్రారంభించారు. సామాన్య ప్రజలతోపాటు వీవీఐపీలు, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సభాస్థలికి చేరుకునేందుకు మొత్తం 8 మార్గాలను గుర్తించారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించారుకాగా, నేటి నుండి 14వ తేదీ వరకు జరుగనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 6 నుండి అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశం ప్రతిష్ట, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ చేశారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ ఆలయానికి పురాతన, చారిత్రక ప్రాశస్త్యం ఉంది. ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తులు ఉండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని కూడా అంటారు

## ఎట్టకేలకు చిరుత చిక్కిందయ్యా..!

వదిలిపెట్టారు. ఇక.. చిరుత పట్టుబడడంతో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు, అటవీశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. పట్టుబడిన చిరుతకు చెందిన మూడు పిల్లలు కూడా యూనివర్సిటీలో తిరుగుతున్నట్లు విద్యార్థులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బోన్లను అలాగే ఉంచి.. చిరుత పిల్లలను కూడా బంధించాలని కోరుతున్నారు.


# అమెరికాలో నిరసన జ్వాలలు

## ట్రంప్, ఎలన్ మస్క్ తీరుకు వ్యతిరేకంగా భారీ ఆందోళనలు

## టారిఫోన్మాదం, ఉద్యోగాల కుదింపుపై దేశమంతటా ర్యాలీలు

## 'హ్యాండ్స్ ఆఫ్' పేరుతో నిర్వహణ

వాషింగ్టన్ : అమెరికాలో ఆ దేశ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌నకు అక్కడి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదరవుతున్నది. ట్రంప్, ఆయన యంత్రాంగంలో భాగమైన ప్రపంచ సంపన్నుడు, వివాదాస్పద డోజ్‌కు నేతృత్వం వహిస్తున్న టెస్లా అధినేత ఎలన్ మస్క్ విధానాలకు వ్యతిరేకంగా ఆ దేశంలో ఆందోళనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ట్రంప్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ చర్యలతో వారు తమ ఆగ్రహావేశాలను వెలిబుచ్చారు. తన,మన అనే తేడా లేకుండా ప్రపంచ దేశాలన్నింటిపైనా వరుసగా సుంకాలు పెంచుతూ టారిఫోన్మాదంతో రెచ్చిపోతున్న ట్రంప్ తీరును, డోజ్ పేరిట ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలను కుదించివేస్తున్న మస్క్ వైఖరిని నిరసిస్తూ పెద్ద పెట్టన ఈ ఆందోళనల్లో అమెరికన్లు నినదించారు. 'హ్యాండ్స్ ఆఫ్' అనే ఈ నిరసన కార్యక్రమాన్ని మూవ్ ఆన్, ఇన్‌డివిజబుల్, ది ఉమెన్స్ మార్చ్, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూప్లస్, న్యాయవాదులు, అనుభవజ్ఞుల సంస్థలు వంటి 150కి పైగా గ్రూపుల సంకీర్ణం నిర్వహించింది. ట్రంప్ మొదటి పదవీకాలంలో ఎదురురైన అనుభవాల నేపథ్యంలో అప్రమత్తమై ప్రస్తుతం ఈ ఆందోళనలను జరిపింది. యూఎస్‌లోని అన్ని 50 రాష్ట్రాలతో పాటు యూరప్‌లోని బెర్లిన్, లండన్ వంటి కీలక నగరాల్లోనూ ఆందోళనకారులు నిరసనలు నిర్వహించారు. 'హ్యాండ్స్ ఆఫ్'గా పిలవబడే ఈ ప్రదర్శనలు.. ట్రంప్ శ్వేత సౌధంలోకి అధ్యక్షులుగా మళ్లీ అడుగుపెట్టిన తర్వాత నిరసనకారుల నుంచి ఎదురైన అతిపెద్ద ప్రతిఘటన ఇదే కావటం గమనార్హం.




### ట్రంప్ నిర్ణయాలపై ఆగ్రహం

యూఎస్‌లోని ట్రంప్ యంత్రాంగం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై ఆందోళనకారులు నిరసనలు చేశారు. ఇందులో ఫెడరల్ వర్క్‌ఫోర్స్‌లో భారీ తొలగింపులు, అబార్షన్ ఆంక్షలు, ట్రేడ్ టారిఫ్‌లు, ప్రజాసేవలను నిలిపివేయటం వంటివి ఉన్నాయి. యూఎస్‌లోని యాంకరేజ్ నుంచి అట్లాంట వరకు.. ప్రదర్శనకారులు ట్రంప్ పాలనలో పెరుగుతున్న నిరంకుశత్వం, పడిపోతున్న జీవన ప్రమాణాల గురించి హెచ్చరించే సంకేతాలను ప్రదర్శించారు. "ఈ దారుణమైన పాలన ప్రపంచవ్యాప్తంగా మన మిత్రదేశాలను కోల్పోయేలా చేస్తున్నది. ఇక్కడ స్వదేశంలోని ప్రజలకూ హాని కలిగిస్తోంది" అని నిరసనకారుడు డయాన్ కోలిఫ్రాత్ (64) అన్నారు. ఆయన న్యూహాంప్‌షైర్ నుంచి 100 మందితో కలిసి వాషింగ్టన్‌లో నిరసన తెలియజేసేందుకు రావటం గమనార్హం.

### దేశవ్యాప్తంగా నిరసనల వెల్లువ

యూఎస్‌లోని వివిధ ప్రాంతాలు అమెరికా యంత్రాంగానికి వ్యతిరేకంగా నిరసనలతో హోరెత్తాయి. ఇటు మెక్సికో, కెనడా, పలు యూరోపియన్ నగరాల్లోనూ ఆందోళనలు జరిగాయి. 1200కు పైగా ర్యాలీల్లో ఆరు లక్షల మందికి పైగా పాల్గొన్నారని నిర్వాహకులు అంచనా వేశారు. మానహట్టన్‌లోని ఐదో అవెన్యూలో 20 బ్లాక్‌లను నిరసనలు విస్తరించాయి. వాషింగ్టన్ మాన్యుమెంట్‌ను వేలాది మంది చుట్టుముట్టారు. అట్లాంటాలో 20 వేల మందికి పైగా నిరసనల్లో పాల్గొన్నారని పోలీసులు అంచనా వేశారు. " కురుస్తున్న వర్షం, 43 డిగ్రీల ఎండ, తీవ్రమైన గాలి.. ఇప్పటికీ అల్బానీలో వేల సంఖ్యలో నిరసనకారులున్నారు" అని రచయిత రోన్ మార్జ్ పోస్ట్ చేశారు. రిప్రోడక్టివ్ రైట్స్ విషయంలో ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా లాస్ ఏంజెల్స్‌లో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. జెండాలపై నినాదాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు.



### మస్క్ నేతృత్వంలోని డోజ్‌పై ఆందోళన

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్ నేతృత్వంలో ట్రంప్ సర్కారు ఏర్పాటు చేసిన వివాదాస్పద 'డోజ్' పైనా నిరసనకారులు గొంతెత్తారు. బిలియన్ల మొత్తంలో పన్ను చెల్లింపుదారులు డబ్బు ఆదా అవుతుందని యంత్రాంగం చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయని చెప్పారు. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ ఒక్కటే.. గతవారం 20 వేల మందికి పైగా కార్మికులను తొలగించింది. "నాకు భయంగా, కోపంగా, దిగ్భ్రాంతికరంగా ఉన్నది. నాకు నా డబ్బు కావాలి. నా ప్రయోజనాలు కావాలి" అని బాల్టిమోర్ దగ్గర సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ హెడ్‌క్వార్టర్ బయట ఆందోళనలో పాల్గొన్న లిండా ఫాల్కావో (65) అన్నారు. అక్కడున్న నిరసనకారులంతా 'ఇదంతా మా డబ్బు' అని ఒక్కసారిగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### ప్రపంచదేశాలపై టారిఫ్‌ల గందరగోళం

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై విధించిన ప్రతీకార సుంకాల ప్రభావం ఆర్థిక మార్కెట్లను కుదిపివేసింది. ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం గురించి హెచ్చరిస్తున్న ఆర్థికవేత్తలనూ ఇది ఆందోళనకు గురి చేసింది. ట్రంప్ టారిఫ్‌ల నిర్ణయం పైనా నిరసనకారులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పలు నగరాల్లో ఆందోళనకారులు రిపబ్లికన్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. "అమెరికాలో జరుగుతున్నది ప్రతీ ఒక్కరి సమస్య. ఇది ఆర్థిక ఉన్మాదం. అతను (ట్రంప్) మనల్ని ప్రపంచ మాంద్యంలోకి నెట్టబోతున్నాడు" అని లండన్‌లో నిర్వహించిన ర్యాలీలో యూఎస్-బ్రిటీష్ ద్వంద్వ పౌరసత్వం కలిగిన లిజ్ చాంబర్లిన్ అన్నాడు.

### 'గౌరవం, భద్రత, స్వేచ్ఛ.. అందరికీ చెందుతాయి'

బోస్టన్‌లో నిర్వహించిన ఆందోళనల్లో నిరసనకారులను ఉద్దేశిస్తూ మేయర్ మిచెల్ వు ప్రసంగించారు. తమ అమ్మమ్మ, తాతయ్య లాంటి వలసదారులను స్వయంచాలకంగా నేరస్థులుగా భావించే ప్రపంచంలో పెరగొచ్చనే విషయాన్ని తాను అంగీకరించను అని చెప్పారు. మానవ హక్కుల ప్రచార అధ్యక్షురాలు కెల్లీ రాబిన్సన్ వాషింగ్టన్ ర్యాలీలో పాల్గొన్నారు. "మనం చూస్తున్న దాడులు రాజకీయపరమైనవి కావు. అవి వ్యక్తిగతమైనవి. మనకు ఈ అమెరికా వద్దు. మనకు అర్హత ఉన్న అమెరికా కావాలి. ఇక్కడ గౌరవం, భద్రత, స్వేచ్ఛ అనేవి మనలో కొందరికి కావు.. అందరికీ చెందుతాయి" అని ఆమె అన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైనా.. శ్వేతసౌధం మాత్రం దీనిని తోసిపుచ్చుతున్నది. ట్రంప్ యంత్రాంగాన్ని సమర్థించుకున్నది. అధ్యక్షుడు ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉన్నదనీ, ఆయన ఎల్లప్పుడూ అర్హులైన లబ్దిదారుల సామాజిక భద్రత, మెడికేర్, మెడికేడ్‌ను రక్షిస్తారని అసిస్టెంట్ ప్రెస్ సెక్రెటరీ లిజ్ హస్టన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




ఒకప్పుడు శ్రీలంకను వణికించిన 'లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) ఆ దేశాన్ని ఇంకా భయపెడుతోంది. నాడు ఎల్‌టీటీఈ పాతిపెట్టిన మందుపాతరలు ఇంకా వెలుగు చూస్తుండటమే ఈ భయానికి కారణం. మందుపాతరలను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రాజెక్టుకు నిధులు నిలిపివేయాలని అమెరికా యోచిస్తోంది. అయితే, అమెరికా సాయం లేకుండా మందుపాతరలను తొలగించడం సాధ్యమయ్యే విషయం కాకపోవడంతో శ్రీలంక ప్రభుత్వం అయోమయంలో పడింది. అమెరికా తన సాయాన్ని కొనసాగించాలని కోరుతోంది. శ్రీలంక సైన్యం, ఎల్‌టీటీఈ మధ్య అంతర్యుద్ధం జరిగిన సమయంలో ఎల్‌టీటీఈ పెద్ద ఎత్తున మందుపాతరలు అమర్చింది. ఇవి ఇప్పుడు అక్కడి వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అంతర్జాతీయ సమాజం సాయంతో వాటిని తొలగించేందుకు సంవత్సరాలుగా ల్యాండ్‌మైన్ నిర్వీర్య దళాలు శ్రమిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి అత్యధిక శాతం నిధులు అమెరికా అందిస్తోంది. ఇప్పుడు వాటిని నిలిపివేయాలని అమెరికా యోచిస్తోంది. అమెరికా కనుక నిధులు నిలిపివేస్తే ల్యాండ్‌మైన్ల తొలగింపు ఆగిపోయే అవకాశం ఉంది. 2017 ఒట్టావా ఒప్పందం ప్రకారం 2028 నాటికి ఎల్‌టీటీఈ పాతిపెట్టిన అన్ని మందుపాతరలను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఇప్పుడు అమెరికా నిధులు నిలిపివేస్తే ఈ లక్ష్యం మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఉంది. 2002లో మందుపాతరల తొలగింపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి 11 దేశాలు మద్దతుగా నిలవగా, అమెరికా పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చింది.

# శ్రీవారిని దర్శించుకున్న హోంమంత్రి



**తిరుమల, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుండాలని హోంమంత్రి అనిత ఆకాంక్షించారు. విజన్-2047, P-4 విధానంతో బంగారు కుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావాలన్నదే %జవీ% లక్ష్యమని స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారిని కుటుంబసమేతంగా ఆమె దర్శించుకున్నారు. VIP విరామ దర్శన సమయంలో మంత్రి అనిత స్వామివారి సేవలో పాల్గొన్నారు. TTD %అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారిని హోంమంత్రి దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

# శ్రీరాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



శ్రీరాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని శ్రీరాముడు చూపించిన బాటలో యువత నడవాలని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా నగరంలో 29 ప్రాంతాల్లో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణానికి హాజరై ఆ సీతారాములను దర్శించుకున్నారు. జాంపేట రిజర్వు పోలీసు క్వార్టర్స్ లోని శ్రీ కోదండరామ ఆలయంలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ధర్మాన్ని రక్షించడంలో కాని, తలిదండ్రుల మాట వినడంలోకాని, భార్య కోసం పోరాటం చేసిన విధానంకాని, తమ్ముడి కోసం త్యాగం చేయడంలో కాని శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆ ఆదర్శం కోసం ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని, సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. కాగా ప్రతి ఏటా జాంపేట రిజర్వు పోలీసు క్వార్టర్స్ లో జరిగే సీతారాముల కల్యాణానికి తయారు చేసే పానకం కోసం ఆదిరెడ్డి కుటుంబం బెల్లం ఇవ్వడం పరిపాటి. ఆ ఆనవాయితిలో భాగంగా ఈ ఏడాది పానకం కోసం ఆదిరెడ్డి కుటుంబం 100 కేజీల బెల్లం ఇవ్వడం జరిగింది.oo

# 'ఫార్మా'లో విషవాయువు లీక్..

## కార్మికుడు మృతి

**అనకాపల్లి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని రాంకీ ఫార్మా సిటీలో విషవాయువు లీకైంది. ఈ ఘటనలో ఓ కార్మికుడు మృతి చెందారు. యాజమాన్యం సరైన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడమే ఈ ఘటనకు కారణమని తోటి కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల కథనం ప్రకారం%ౌ% విశాఖ ఫార్మా సిటీ లిమిటెడ్ సిఇటిపిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పరవాడ మండలం తానాం గ్రామానికి చెందిన చీపురుపల్లి అప్పలనాయుడు (41) పనిచేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి వ్యర్థ రసాయనాల శాంపిల్స్ సేకరిస్తుండగా గాఢమైన విష వాయువులు వెలువడ్డాయి. యాజమాన్యం ఆయనకు ఇచ్చిన మాస్కు ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో విషవాయువు ప్రభావానికి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పరవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరిశ్రమల శాఖాధికారి కె.సుధాకర్, డిప్యూటీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి జివిఎస్ నారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

### రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి :: ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్

మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

### రూ.50 లక్షల పరిహారం చెల్లింపునకు యాజమాన్యం అంగీకారం

కార్మికుని కుటుంబానికి రాంకీ యాజమాన్యం రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించడానికి అంగీకరించింది. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.లక్షను వెంటనే అందజేసింది. అప్పలనాయుడు పిల్లలకు ఇంటర్మీడియట్ వరకు కార్పొరేట్ విద్య అందించడానికి, ఆయన భార్యకు శాశ్వత ఉపాధి కల్పించడానికి అంగీకరించింది. గ్రూప్ ఇన్సూరెన్స్‌లో భాగంగా మరో రూ.10 లక్షలు చెల్లించడానికి, చట్ట ప్రకారం రావలసిన అన్నీ ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. చర్చల్లో ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు పిఎస్.రాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పైలా జగన్నాథరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, యాజమాన్య ప్రతినిధులు గిరిధర్ బక్షి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

# క్రమబద్ధీకరణ చేద్దామా

- ఫ్రీహోల్డ్ భూమి సమస్యకు పరిష్కారమిదే
- మార్కెట్ ధర వసూలు చేస్తే సరిపోతుంది
- పేదలకు కష్టం కలగకుండా చర్యలు
- ప్రభుత్వానికి అందుతున్న సూచనలు
- జగన్ హయాంలో ప్రహసనంలా ఫ్రీహోల్డ్
- కార్డులే లేని భూములకూ 'విముక్తి'లి
- వాటిని క్రమబద్ధీకరిస్తే ఖజానాకు ఆదాయం
- ఫీజు కట్టించుకుని కొన్నవారికే రెగ్యులరైజ్
- 17న కేబినెట్ ఉపసంఘం సమావేశం
- అన్నిరకాల సూచనలు, సలహాలపై దృష్టి



వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ఫ్రీ హోల్డ్ చేసిన భూమి 5.74 లక్షల ఎకరాలు. ఈ భూమి విలువ కనీసం 90వేల కోట్లపైనే. ఇందులో రికార్డులు లేకుండానే ఫ్రీహోల్డ్ చేసిన భూమి 2.69 లక్షల ఎకరాలు. దీని విలువ కనీసం 35వేల కోట్లపైనే ఉంటుందని రెవెన్యూ శాఖ అంచనా. ఇంత విలువైన భూమిని అక్రమంగా, అడ్డదిడ్డంగా ఫ్రీహోల్డ్ చేసిన జగన్ సర్కారు ఎవరికి పంచి పెట్టాలని చూసింది? ఎవరి ఖాతాలో ఆ భూములను వేయాలనుకుంది? ఎవరికి దోచిపెట్టాలనుకుంది? ఇవి తెలుసుకునే అవకాశం లేకుండానే జగన్ సర్కారు ప్రజాగ్రహానికి బలయింది. ఇప్పుడు ఈ భూముల అక్రమాలను ఏం చేయాలి? ఎలా పరిష్కరించాలో కూటమి సర్కారుకు బోధపడటం లేదు. జగన్ సర్కారు అక్రమాల పరంపరను నిలువరించగలిగినా, ప్రభుత్వం మారే నాటికే జరిగిన అక్రమాలను ఎలా సక్రమం చేయాలో ఓ పట్టాన అంతుచిక్కడం లేదు. ఇప్పటికే మార్గాన్వేషణ కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మరోవైపు రాష్ట్రంలో రెవెన్యూ నిపుణులు, మేధావులు, రిటైర్డ్ అఖిల భారత సర్వీసు అధికారులు, భూములపై అవగాహన ఉన్న పెద్ద మనుషుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రెవెన్యూశాఖను ఆదేశించారు. మరోవైపు జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ నిపుణులు వేర్వేరు మార్గాల ద్వారా తమ సూచనలు, సలహాలు ప్రభుత్వానికి పంపిస్తున్నారు. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం తొలిదఫా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించింది. ఈనెల 17న మరోసారి భేటీ కానుంది. అసైన్డ్ భూముల చట్టం-1977కు విరుద్ధంగా గత ప్రభుత్వం జీవో 596 తెచ్చింది. దీని ప్రకారం, 20 ఏళ్ల గడువు తీరిన అసైన్డ్ భూములను నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించాలి. ఆ తర్వాత ఆ భూముల యజమానులకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ అందించాలి. వాటి ఆధారంగా రైతులు తమ భూములను ఇతరులకు అమ్ముకోవచ్చు. అయితే, ఈ ప్రక్రియ సజావుగా సాగలేదు. 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తే అందులో 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారని రెవెన్యూశాఖ నిర్ధారించింది. ఫ్రీహోల్డ్, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసింది. కొత్తగా అక్రమాలు జరగకుండా నిరోధించింది. కానీ, అప్పటికే గుర్తించిన అక్రమాల విషయంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు వస్తున్నాయి. అందులో కొన్ని..

### ఇలా చేద్దామా?

అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో, పేదల ఆధీనంలో లేని వాటి విషయంలో క్రమబద్ధీకరించాలి. అంటే, నిజమైన పేదల్లో ఎకరం, రెండు ఎక రాల లోపు భూమి ఉన్నవారే ఎక్కువ. భూములను ఉన్నపళంగా ఫ్రీహోల్డ్ చేయించి అమ్ముకోవాల్సిన అవసరం వారికి ఉండదని ఓ కీలక మంత్రి ఇప్పటికే ఉపసంఘంలో సూచన చేసినట్లు తెలిసింది. రికార్డులే లేకుండా ఫ్రీహోల్డ్ చేసిన 2.69 లక్షల ఎకరాలతోపాటు, పేదలు, సామాన్యులతో సంబంధం లేని భూములను ఆ ప్రాంతంలో ఉన్న భూముల రేట్ల ఆధారంగా క్రమబద్ధీకరించాలని మరో సీనియర్ మంత్రి ప్రతిపాదించినట్లు సమాచారం. జగన్ సర్కారు అసైన్డ్ చట్టసవరణ చేయడానికి ముందే లక్షల ఎకరాలు చేతులు మారాయని రెవెన్యూశాఖ గుర్తించింది. ఇలా చేతులు మారిన భూములు ఇప్పటికీ రిజిస్ట్రేషన్ కాలేదు. ఈ కోవలోకి వచ్చే భూములను గుర్తించి కొనుగోలు చేసిన వారి దగ్గర మార్కెట్ ఫీజు వసూలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలి. దీని వల్ల భారీ ఆదాయం వస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ ఒకరు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. చట్టప్రకారం, జీఓ నం. 596 మార్గదర్శకాల మేరకు ఒరిజినల్ అసైనీలు పొజిషన్‌లో ఉన్న భూములను గుర్తించి వాటి వరకే ఫ్రీ హోల్డ్ చేయాలి. ఈ ప్రక్రియ కొంత సమయం తీసుకున్నా ఇదే అసలైన చట్టబద్ధమైన స్ఫూర్తిగా ఉంటుందని రెవెన్యూశాఖకు లిఖితపూర్వకంగా సూచనలు వచ్చాయి. పొజిషన్‌లో ఉన్న రైతులను గుర్తించి వారి భూములను ఫ్రీ హోల్డ్ చేసి, వారి పేరిటే రిజిస్ట్రేషన్ చేస్తే సరిపోతుందని, అప్పుడు భూ కబ్జాదారులెవరో సులువుగా కనిపెట్టవచ్చని రైతు కూలీ సంఘం నుంచి సూచన వచ్చింది. మొత్తంగానే ఫ్రీ హోల్డ్ విధానాన్ని రద్దుచేయాలని రిటైర్డ్ రెవెన్యూ అధికారి సురేంద్రనాథ్ ప్రభుత్వానికి సూచించారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
సోమవారం 07 ఏప్రిల్ 2025



## పేపర్ ప్లేట్ మిషన్ కు రూ.లక్ష విరాళం

అమలాపురం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శాసన మండలి సభ్యులు డాక్టర్ పండుల రవీంద్ర బాబు రూ.లక్ష విరాళంతో సమకూర్చిన పేపర్ ప్లేట్ మిషన్ ను మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ తరపున ఆదివారం అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామంలో రవీంద్రబాబు,అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ పుణ్యమంతుల రజిని అధ్యక్షతన పేపర్ ప్లేట్ మిషన్ ను లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆనందరావు మాట్లాడుతూ మహిళలందరూ స్వయం ఉపాధి ద్వారా ముందుకు వెళ్లాలని, ప్రతి మహిళ పొదుపును పాటిస్తూ సమాజంలో ఆదర్శంగా ఎదగాలని ఆకాంక్షించారు.మరో ముఖ్య అతిథి రవీంద్ర బాబు మాట్లాడుతూ మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ వారికి ఇచ్చిన మాట ప్రకారం పేపర్ ప్లేట్ మిషన్ సమకూర్చడం జరిగిందని, దీనిని లబ్ధిదారులు చక్కగా ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రజని, సభ్యులను ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ లు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక సర్పంచ్ తిరుకోటి సుజాత, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మండలిక సుబ్రహ్మణ్యం శర్మ (దత్తుడు ), స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేరమ్మ అగ్రహారంలో రామయ్యను సందర్శించిన ఎమ్మెల్యే అయితాబత్తుల



అమలాపురం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీ రామ నవమి సందర్భంగా అమలాపురం పట్టణం వంట్లెదు వీధి, మంచి నీటి చెరువుగట్టు మరియు పేరమ్మ అగ్రహారం లో ఉన్న రామాలయలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం సందర్శించారు. స్వామి వారి దివ్య ఆశీర్వాదాలు పొందారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు... అమ్ముడా చైర్మెన్ శ్రీ అల్లాడ స్వామి నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి నల్లా స్వామి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టీడీపీ నాయకులు అల్లాడ వాసు, వంట్లెదు బాబు, యాళ్ల గంగాధర రామారావు(బాబ్జి), భాస్కర్ల రామకృష్ణ, రవితేజ, గంటి శ్రీనివాస్, దున్నాల దిలీప్ మరియు గంటి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు...

## శ్రీరామనవమి వేడుకల్లో ముస్లింలు మజ్జిగ వితరణ



ఆలమూరు ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మత సామరస్యాన్ని చాటుతూ మండలంలోని మడికి శివారు చిలకలపాడులో ఆదివారం జరిగిన శ్రీరామనవమి వేడుకలలో రామాలయం వద్ద అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేసారు. సీతారాముల కళ్యాణం వేడుకలలో బాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ జిల్లా అధ్యక్షులు షేక్ సుల్తాన్ మాట్లాడుతూ %ా% అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ వ్యవస్థాపకులు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ శ్రీరామచంద్ర మహారాజు, శ్రీకఅష్ణ మహారాజుల్ని గొప్ప దైవ సందేశ హరులుగా పేర్కొన్నారుని, సర్వ మతాల సారాంశం ఒకటేనని బోధించారనీ, ఇలాంటి మతసామరస్య కార్యక్రమాలను దేశవ్యాప్తంగా కమ్యూనిటీ నిర్వహిస్తోందన్నారు. జిల్లా ఇంచార్జ్ మహమ్మద్ సిరాజ్ మాట్లాడుతూ హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అ.స) 1889వ సంవత్సరంలో పంజాబ్ రాష్ట్రం ఖాదియాన్ నగరంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీని స్థాపించారని, వారు ఇస్లాం వ్యవస్థాపకులు ముహమ్మద్ ప్రవక్త చేసిన భవిష్యవాణి ప్రకారం తానే వాగ్దాత్త మసీహ్ అని ప్రకటించారు. ఈ కమ్యూనిటీ నేడు ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో శాంతి, సమానత్వం, న్యాయం, మతసామరస్యంతో కూడిన సమాజ నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకొని, 'అందరిని ప్రేమించు ఎవ్వరినీ ద్వేషించకు' అనే నినాదంతో 'హ్యూమానిటీ ఫస్ట్' శాఖ ద్వారా మానవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కమ్యూనిటీ ప్రస్తుత ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ నేతఅత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి నగేష్ ,ఈదర రమేష్, కొత్తపల్లి కఅష్ణ, కమ్యూనిటీ రాష్ట్ర ప్రజా సంబంధాల ప్రతినిధి మహమ్మద్ జావిద్ అహ్మద్, మౌల్వి ముహమ్మద్ అక్బర్, మీను పాషా, గుల్ మీరా తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## వాడవాడల కనులవిందుగా శ్రీ రాములోరి కల్యాణ మహోత్సవాలు...

అమలాపురం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో శ్రీరామ నవమి పురస్కరించుకొని శ్రీరామాలయాలలో శ్రీ సీతారాముల కళ్యాణ మహొూత్సవాలు ఆచార్యుల మంత్రోచ్చారణ మధ్య కనులు విందుగా జరిగాయి. కొత్తపేట నియోజకవర్గం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, అమలాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుండి భక్తులు ఆలయాలకు వెళ్లి శ్రీ సీతారామవారిని అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయాలలో స్వామివారిని దర్శించుకున్నారు. అమలాపురం గొవ్వాల వారి వీధి శ్రీ సీతారాముల ఆలయం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణం కన్నులవిందుగా నిర్వహించి భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.



## సీతారాముల కళ్యాణం... ఊరూరా మహోత్సవం

### శ్రీరామనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

### కళ్యాణం.. కమనీయం

కొత్తపేట, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

. శ్రీరామనవమి వేడుకలు ఆదివారం కొత్తపేట నియోజవర్గ ప్రజలు వైభవంగా నిర్వహించారు. రామాలయాలకు భక్తులు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. ప్రతి ఆలయంలోనూ సీతారామ కళ్యాణాలు వైభవ్వేతంగా నిర్వహించారు. ఈ కళ్యాణ ఘట్టాన్ని భక్తులు తిలకించి తరించారు. శ్రీరామ నామ జపంతో అంతా రామమయంగా మారింది. ముఖ్యంగా కొత్తపేటలోని శ్రీరామ్ నగర్ లో మామిడిశెట్టి సోమరాజు బ్రదర్స్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచారణలు, మంగళ వాయిద్యాలు నడుమ సీతారాముల కళ్యాణ మహొూత్సవాలు కమనీయంగా జరిగాయి. అలాగే కొత్తపేట కొత్తరామాలయం, పాతరామాలయం, కొప్పిశెట్టి వారి వీధి,గౌతమినగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కళ్యాణం కనుల పండుగగా జరిపారు.ఎక్కడికి అక్కడ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు.భక్తులకు బెల్లం పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.



## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం..

ఆలమూరు ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం మండల పరిధి 18 గ్రామాలలో వాడవాడలా ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయాలకు స్థానిక ప్రజలు భక్తి శ్రద్దలతో అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. ప్రతి ఆలయంలోనూ అర్చక స్వాములు, ఆయా కమిటీల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణాలు అత్యంత వైభవంగా జరిపించారు. ఈ కళ్యాణ ఘట్టాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించి తరించారు. శ్రీరామ నామ జపంతో అంతా రామమయంగా ఆ ప్రదేశమంతా మారింది. ముఖ్యంగా మండలంలోని చెముడులంకలో శ్రీ కోదండరామ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కమిటీ పెద్దలు మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు మాజీ డిసి అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటరత్నం ల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీకఅష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచారణలు, మంగళ వాయిద్యాలు నడుమ సీతారాముల కళ్యాణ మహొూత్సవాలు కమనీయంగా జరిగింది. పలువురు దంపతులు హాజరై కళ్యాణ తంతు జరిపించారు. భక్తులకు బెల్లం పానకాలు పంపిణీ కు, భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి సత్యానందం, కొత్తపల్లి రామకృష్ణ, సిరంగుల సతీష్, గుండుమల్ల రాంబాబు, అడబాల వీర్రాజు, తమ్మన ఏసు, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

### కలెక్టర్ పి ప్రశాంతి



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రతి సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార కోసం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం ఏప్రియల్ 7 వ తేదీ సోమవారం యధావిధిగా కలక్టరేట్ , డివిజన్, మండల కేంద్రంలో, మునిసిపల్ కార్పొరేషన్ పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్ , మండల కేంద్రంలో ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు , జిల్లా, డివిజన్ మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు.


## గొడ్రాలు అనే మాట పడలేకే.. ఈ నాటకం..!

రాజమహేంద్రవరం, కాకినాడ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజమహేంద్రవరంలో కలకలం సృష్టించిన గర్భిణి కొప్పిశెట్టి సంధ్యారాణి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. దేవీపట్నం మండలం ఇందుకూరిపేటకు చెందిన కొప్పిశెట్టి సంధ్యారాణి 9 నెలల గర్భిణి కావడంతో ఆమె భర్త రాజమహేంద్రవరంలోని జయ కిడ్నీకేర్ ఆసుపత్రికి గురువారం పురిటికి తీసుకువచ్చాడు. ఆసుపత్రిలో ఆమెకు ఓపీ చీటీ రాశారు. డాక్టర్ చూసేలోగా ఆమె రెండుసార్లు బయటకు వచ్చింది. అలా మూడోసారి బయటకు వచ్చి కనిపించకుండా పోయింది. దీంతో కంగారుపడిన సంధ్యారాణి భర్త విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు తెలిపాడు. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై షేక్‌సుభాణీ, మరికొంత మంది పోలీసులు రెండు టీములుగా విడిపోయి ఆచూకీ కోసం గాలించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సంధ్యారాణి ఫోన్ ఆధారంగా కాకినాడలో ఆమె ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడ బస్టాండ్‌లో ఆమెను పట్టుకున్నారు. పోలీసులు ఆమెను ప్రశ్నించగా...తనను ఎవరో కిడ్నాప్ చేశారని, తనకు ఇద్దరు కవల పిల్లలు పుట్టారని, ప్రసవం అయిన వెంటనే పిల్లను ఎవరో ఎత్తుకెళ్లిపోయారని, పలు రకాలుగా పోలీసులకు తెలిపింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

### 9 నెలలు గుడ్డలు పెట్టుకుని గర్భిణిగా..

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో దుర్గను పరిశీలించిన వైద్యులు ఆమె గర్భిణి కాదని తేల్చి చెప్పారు. దీంతో హతాశు లయిన పోలీసులు తేరుకుని ఆమె ఈ నాటకం ఆడడానికి గల కారణాలను తెలుసుకున్నారు. దుర్గకు పెళ్లి అయి తొమ్మిది సంవత్సరా లు అయ్యింది. ఆమెకు పిల్లలు లేరు. దీంతో ఆమె బయటి వారు, ఇంటిలో కుటుంబ సభ్యులు ఆమెను గొడ్రాలుగా చూస్తున్నారు అనే భావనంతో తనకు కడుపు వచ్చినట్లు నాటకమాడింది. ఈ తొమ్మిది నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలని, భార్యాభర్తలు చాలా దూరంగా ఉండాలని తెలిపింది. సంధ్యారాణి డాక్టర్ దగ్గరకు వచ్చి లోపలికి వెళ్లినప్పుడు తనకు గర్భం ఎందుకు రావడం లేదని మాత్రమే అడిగి బయటకు వచ్చేసేది. బయట భర్తను కూర్చోపెట్టి ఆ సమయంలో ఆమె ఒక్కతే డాక్టర్ వద్దకు వెళ్లేది. డాక్టర్ అంతా బావుందని, పురుడు వచ్చే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారని తెలిపేది. దీంతో దుర్గ భర్త




నిజమని నమ్మి ఆమెను కంటికి రెప్పలా చూసుకోసాగాడు. ఆమె కడుపు రోజురోజుకీ పెరుగుతున్నట్లు గుడ్డలు పెట్టుకుని కాలం వెళ్లదీసింది. చివరికి ఆ తంతు బయట పడడంతో ఆమె పరిస్థితిపై జాలిపడడం పోలీసుల వంతైంది. పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును వేగంగా ఛేదించిన త్రీటౌన్ సీఐ వర్రే అప్పారావు, ఎస్సై షేక్‌సుభానీ, పోలీసు సిబ్బందిని ఎస్పీ డి.నరసింహాకిశోర్ అభినందించారు.





## జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీ సీతారామకళ్యాణం.

**కాకినాడ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


శ్రీరామనవమి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో గల శ్రీ సీతారామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అతి వైభవంగా జరిగింది. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ దంపతులు పెళ్ళి పెద్దలుగా పాల్గొన్నారు.శ్రీ రామనవమి సందర్భంగా కాకినాడ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ లైన్ నందు రామాలయము నందు ఎఆర్ పోలీస్ వారిచే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారాముల కళ్యాణం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది.కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ సతీ సమేతంగా పీటలపై కూర్చుని వేదం మంత్రాల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు.శ్రీ సీతారాముల వారి కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవమునకు పెద్ద ఎత్తున ప్రజలు, పోలీస్ సిబ్బంది, అధికారులు హాజరైనారు.అదనపు ఎఆర్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం ఎస్డీపివోలు లు,ఎఆర్ డిఎస్పీ శ్రీ హరి రావు,ఎఆర్ ఇన్స్పెక్టర్లు, కాకినాడ పట్టణం ఇన్స్పెక్టర్లు, జిల్లా కార్యాలయ వివిధ విభాగాలు ఇన్స్పెక్టర్లు కుటుంబ సమేతంగా మరియు సిబ్బంది స్థానిక భక్తులు హాజరై కళ్యాణం తిలకించారు.

## కన్నుల విందుగా 90వ సీతారాముల కళ్యాణ మహోత్సవం



**ఏలూరు ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏలూరు అమీనా పేట లో ఉన్న శ్రీ అభయ అంజనేయ స్వామి వారి ఆలయంలో 90వ సీతారాముల కళ్యాణ మహోత్సవం కనువిందుగా ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, వారి సతీమణి జాయింట్ కలెక్టర్ దాత్రిరెడ్డి వారి చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవంలో పోలీసు ఉన్నతాధికారులు వారి కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## ఏపీలో విజృంభిస్తున్న

# హెపటైటిస్!

**అమలాపురం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొనసీమ జిల్లా పల్లం గ్రామంలో హెపటైటిస్-బీ, సీ వైరస్ కేసులు భారీగా వెలుగు చూశాయి. గ్రామంలో మొత్తం 15 వేల మంది జనాభా ఉండగా.. రెండు వేల మంది బ్లడ్ శాంపిలను వైద్యులు సేకరించారు. వారిలో 205 మందికి పాజిటివ్గా తేలింది. వీరిని అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యాధి లివర్ పై ప్రభావం చూపుతుంది.




## భారీగా తగ్గుతున్న

# గోల్డ్ రేటు..

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితిలో ఉన్నప్పుడు సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారంలోకి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో గత ఏడాది వ్యవధిలో బంగారం ధర పెరగడానికి ప్రధాన కారణంగా ఇదే. అయితే, ధరలు భారీగా పెరగడంతో ఆభరణాల విక్రయాలు దాదాపు 70శాతం క్షీణించినట్లు, పాత ఆభరణాల మార్పిడితో కొత్తవి తీసుకోవడం పెరిగిందని విక్రేతలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాలపై విధిస్తున్న టారిఫ్ లు అమల్లోకి వస్తుండగా.. పసిడి గరిష్ఠ ధరలు నిలబడవనే అంచనాతో ఇన్వెస్టర్లు ఈ లోహాల్లోనూ లాభాల స్వీకరణకు దిగుతున్నట్లు సమాచారం. దీంతో గోల్డ్ రేటు అమాంతం తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలాఖరు, మే నెలలో బంగారం ధర మరింత తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు ఫలించి యుద్ధ విరమణ చోటుచేసుకుంటే పసిడి ధర మరింతగా దిగొస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి



## స్టీల్ ప్లాంటుకు రూ.2,400 కోట్లు చేయూత

**విశాఖపట్నం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీలో ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయిన విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు చేయూత అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. దీనిపై తాజాగా జరిగిన రాష్ట్ర కేబినెట్ భేటీలో చర్చించింది. ఆర్థిక సమస్యల కారణంగా స్టీల్ ప్లాంటు విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతోంది. వివిధ సంఘాల అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి, ఆయా బిల్లుల మొత్తం సుమారు రూ.2,400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది.



## పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని

**తమిళనాడు ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జి ప్రారంభానికి ముస్తాబైంది. తమిళనాడు లోని రామనాథపురం జిల్లాలో రూ.535 కోట్లతో నూతనంగా నిర్మించిన పాంబన్ వంతెనను ప్రధాని మోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఈ కార్యక్రమాన్ని శ్రీరామనవమి రోజున మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో ప్రధాని పాంబన్ నుంచి రిమోట్ పద్ధతిలో వంతెన వర్టికల్ లిఫ్ట్ మెకానిజాన్ని ప్రారంభిస్తారు.

# ఇప్పటికే రూ. 600 కోట్లు నష్టం!

- మత్స్య ఎగుమతిదారులపై అమెరికా సుంకాల ప్రభావం
- నిలిచిపోయిన షిప్‌మెంట్లతో తీవ్ర ఆందోళన..
- ఇదే అదనుగా దోపిడీకి పాల్పడుతున్న కంపెనీ
- శనివారం రొయ్యలు కిలోకు రూ.30-90 తగ్గించి కొనుగోళ్లు
- 15 రోజులపాటు పట్టుబడులు పట్టకూడదని రైతుల నిర్ణయం
- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటున్న రైతు సంఘాలు



**అమరావతి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమెరికా దిగుమతి సుంకం రాష్ట్ర మత్స్య ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నెల 9వ తేదీ నుంచి భారం ప్రత్యక్షంగా పడనుంది. ఏప్రిల్ మొదటి వారంలో భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యేందుకు మత్స్య ఉత్పత్తులతో 2 వేల షిప్‌మెంట్లు సిద్ధంగా ఉన్నాయి. మరో 2,500 షిప్‌మెంట్లకు సరిపడా సరుకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంది. వీటిలో మొత్తంగా దాదాపు 3,500 షిప్‌మెంట్లు ఏపీకి చెందినవేనని ఎగుమతిదారులు చెబుతున్నారు. కొత్తగా విధించిన దిగుమతి సుంకం ప్రకారం లెక్కిస్తే వీటిపై భారం రూ.600 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ మేరకు నష్టపోవడమే తప్ప ఈ భారాన్ని తిరిగి కొనుగోలుదారులపై వెయ్యలేని పరిస్థితి ఉందని ఎగుమతిదారులు చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్-అమెరికాల మధ్య జరిగిన వ్యాపార లావాదేవీల విలువ 6.6 బిలియన్ డాలర్లు. వీటిలో ఎగుమతుల విలువ 5 బిలియన్ డాలర్లు, దిగుమతుల విలువ 1.6 బిలియన్ డాలర్లు. ఎగుమతుల్లో మత్స్య ఉత్పత్తుల విలువ 2.55 బిలియన్ డాలర్లపైమాటే. అమెరికాకు ఆహార, మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశాల్లో 42.3 శాతంతో భారత్ మొదటి స్థానంలో నిలవగా, 26.9 శాతంతో ఈక్విడార్ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత వరుసగా ఇండోనేషియా (15.4%), వియత్నాం (7.2 %), థాయిలాండ్ (2.4%), అర్జంటేనియా (2.1%) దేశాలు ఉన్నాయి.


### భారత్‌ను అధిగమించనున్న ఈక్విడార్

భారత్‌పై 27 శాతం దిగుమతి సుంకం విధించిన అమెరికా.. ఈక్విడార్ నుంచి దిగుమతి చేసుకునే ఆహార ఉత్పత్తులపై కేవలం 10 శాతం మాత్రమే సుంకం విధించింది. ఈ కారణంగా ఈక్విడార్ నుంచి పోటీని తట్టుకోవడం కష్టమేనని, భారత్‌కు వచ్చే ఆర్డర్స్ అన్నీ ఇక ఈక్విడార్‌కు వెళ్లే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. ఇప్పటికే ఏటా 11-12 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తితో ఈక్విడార్ మన దేశాన్ని రెండవ స్థానానికి నెట్టేసింది. కాగా, రాష్ట్రంలో నిన్నటి వరకు కిలోకు రూ.20-40 మేర కోత పెట్టి కొనుగోలు చేయగా, శనివారం ఏకంగా రూ.30-90 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మొన్నటి వరకు 30 కౌంట్ (కిలోకు వచ్చే రొయ్యల సంఖ్య) కిలో రూ.470 పలుకగా, శనివారం రూ.380తో.. 50 కౌంట్ అయితే రూ.360- రూ.300కు తగ్గించేశారు. దీంతో కంపెనీల నుంచి స్పష్టత వచ్చే వరకు పట్టుబడులు పట్టకూడదని ఆక్వా రైతు సంఘాలు నిర్ణయించాయి. కనీసం 10-15 రోజుల వరకు పట్టుబడులు పట్టకూడదని రైతులకు సూచిస్తున్నారు.

### ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ట్రంప్ టాక్స్ సాకుతో ధరలు తగ్గించడం సరికాదు. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఇప్పుడు లభిస్తున్న ధరలే గిట్టుబాటు కావడం లేదు. ఈ ధరలను కూడా మరింత తగ్గిస్తే సమీప భవిష్యత్‌లో పూర్తిగా ఆక్వా సాగుకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. రైతుల తరఫున ఉద్యమించేందుకు ఫెడరేషన్ సిద్ధంగా ఉంది

## ఏపీలో మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు



**అమరావతి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు వచ్చే మే నెలలో బదిలీలు చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వారి బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. మొదటిసారి ఈ చట్టం ప్రకారం బదిలీలు చేయబోతున్నారు. జీఓ - 117ను రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా తీసుకునే చర్యలపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1-5 తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున కేటాయిస్తూ ఈ విధానాన్ని తీసుకొస్తున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# రక్షణ సహకారానికి 'సప్తపది'

## ఏడు ఒప్పందాలపై భారత్-శ్రీలంక సంతకాలు

## మోదీకి అత్యున్నత 'మిత్ర విభూషణ' పురస్కారం



కొలంబో:

రక్షణ రంగంలో బంధాలను బలోపేతం చేసుకునే వ్యవస్థను రూపొందించడానికి తొలిసారిగా భారత్-శ్రీలంక ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రెండు దేశాల భద్రత పరస్పర ఆధారితమని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. బ్యాంకాక్‌లో బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొన్న ఆయన అక్కడి నుంచి శుక్రవారం రాత్రి నేరుగా శ్రీలంకకు చేరుకున్నారు. కొలంబోలోని చారిత్రక ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు కుమార దిసనాయకే శనివారం ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ ఓ విదేశీ ప్రభుత్వాధినేతకు స్వాగతం లభించడం ఇదే ప్రథమం. దిసనాయకేతో చర్చల అనంతరం వారి సమక్షంలో ఒప్పందాలు కుదిరాయి. యూఏఈతో కలిసి ట్రింకోమలీని ఇంధన కేంద్రంగా అభివృద్ధి చేయడం, పవర్‌గ్రిడ్ ద్వారా అనుసంధానత వంటివి దీనిలో ఉన్నాయి. రుణాల పునర్వ్యవస్థీకరణకూ భారత్ ఆమోదం తెలిపింది.

### మత్స్యకారుల్ని వదిలిపెట్టండి

రెండు దేశాల మధ్య మత్స్యకారుల వివాదాలకు మానవతా దృక్పథంతో పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. శ్రీలంక నిర్బంధంలో ఉన్న మత్స్యకారుల్ని, వారి పడవల్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. శ్రీలంకలోని తమిళ నేతల బృందంతోనూ మోదీ విడిగా భేటీ అయ్యారు. భారతదేశ భద్రత ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమ భూభాగాన్ని ఏ రూపంలోనైనా వాడుకునేందుకు ఏ దేశాన్నీ అనుమతించేది లేదని దిసనాయకే స్పష్టంచేశారు. చర్చల అనంతరం ఇద్దరు నేతలు కలిసి సంపూర్ సౌర విద్యుత్కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. శ్రీలంక అత్యున్నత పురస్కారమైన మిత్ర విభూషణ అవార్డును మోదీకి దిసనాయకే ప్రదానం చేశారు. ఇది 140 కోట్లమంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు భారత ప్రధాని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో మోదీ కృషికి గుర్తింపుగా దీనిని అందజేశారు.

# '7 రోజుల్లో దేశాన్ని వీడండి'

## అమెరికాలోని ఉక్రేనియన్లకు వణుకు పుట్టించిన మెయిల్



వాషింగ్టన్:

అగ్రరాజ్య అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి వలసల విషయంలో అమెరికా సర్కారు దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోంది. వారిని స్వదేశాలకు తిప్పి పంపుతోంది. తాత్కాలిక వలసదారులపైనా కన్నెర్ర చేస్తోంది. ఈ పరిణామాల వేళ వారం రోజుల్లోగా దేశాన్ని వీడాలంటూ వచ్చిన ఓ మెయిల్ అగ్రరాజ్యంలోని ఉక్రెయిన్ పౌరులను హడలెత్తించింది. తర్వాత అది పొరపాటుగా వచ్చిన మెయిల్ అని అధికారులు చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అసలేం జరిగిందంటే.. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత ఆ దేశానికి చెందిన పౌరులను ఆదుకునేందుకు అమెరికా ముందుకొచ్చింది. మానవతా పెరోల్ ప్రోగ్రామ్ కింద వారికి అగ్రరాజ్యంలో తాత్కాలిక నివాసం కల్పించింది. అయితే, ఇటీవల వీరందరికీ ఓ సందేశం వచ్చింది. "మీ పెరోల్‌ను రద్దు చేస్తున్నాం. ఇంకా అమెరికాలోనే ఉండాలని ప్రయత్నించొద్దు. ఏడు రోజుల్లోగా దేశం విడిచివెళ్లాలి. లేదంటే ఫెడరల్ ప్రభుత్వమే వెతికి పట్టుకుంటుంది" అని ఆ సందేశంలో ఉంది. దీంతో వారంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీనిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ అధికార ప్రతినిధి స్పందిస్తూ.. అది పొరపాటుగా వెళ్లిన సందేశం అని తెలిపారు. ఉక్రెయిన్ పౌరులకు కల్పించిన మానవతా పెరోల్‌ను రద్దు చేయలేదని పేర్కొన్నారు. వారి తాత్కాలిక నివాస హోదాలో ఎలాంటి మార్పు లేదన్నారు.

# ట్రంప్‌తో ప్రపంచీకరణ ముగిసినట్లే..

## త్వరలో బ్రిటన్ ప్రధాని ప్రకటన

'అమెరికా ఫస్ట్' నినాదంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై భారీగా పన్నులు విధించిన విషయం తెలిసిందే. ఆయన చర్యలతో అంతర్జాతీ మార్కెట్లను అనిశ్చితిలోకి నెట్టారని బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఇటీవల పేర్కొన్నారు. 1991లో సోవియట్ యూనియన్ పతనంతో ప్రారంభమైన ప్రపంచీకరణ ఇక్కడితో ముగిసిపోయిందని ఆయన సోమవారం ప్రకటించాలనుకుంటున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థల కథనాలు వెల్లడిస్తున్నాయి.



టైమ్స్ నివేదిక ప్రకారం.. ఆర్థిక జాతీయవాదం విషయంలో అమెరికా తీసుకుంటున్న చర్యలను స్టార్మర్ కూడా అంగీకరించారు. అంతర్జాతీయ వాణిజ్యంలో కొత్త యుగం ప్రారంభమయ్యిందని.. అమెరికా అధ్యక్షుడి విధానాన్ని అందులోని వారు సమర్థిస్తున్నారని ఆయన గుర్తించారు. ప్రపంచీకరణ చాలా మంది శ్రామికులకు అనుకూలంగా ఉండదన్నారు. దీనికి వాణిజ్య యుద్ధాలు సమాధానం అని మేము నమ్మడం లేదని అభిప్రాయపడ్డారు. ప్రత్యామ్నాయం చూపేందుకు ఇదొక అవకాశంగా స్టార్మర్ ఇటీవల అభివర్ణించడం గమనార్హం. వాణిజ్య అడ్డంకులను తొలగించడానికి ట్రంప్ తీసుకుంటున్న చర్యల వల్ల పోటీ పెరుగుతోందన్నారు. దానికి అనుగుణంగా ప్రపంచ దేశాలు తమ ఉత్పాదకతను పెంచడానికి కృషి చేస్తాయన్నారు.

### భవిష్యత్తులో యూఎస్-యూరప్‌ల మధ్య సుంకాలు ఉండవు..! మస్క్ కీలక వ్యాఖ్యలు

గత నెల హాంకాంగ్‌లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ సర్ మార్క్ టక్కర్ అమెరికా అనుసరిస్తున్న పన్నుల విధానంపై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు, ట్రంప్ వాణిజ్య విధానాలతో అంతర్జాతీయ సమాజం మొత్తం చిన్న ప్రాంతీయ బ్లాక్‌లు, క్లస్టర్లుగా విడిపోయే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో వాటి మధ్య బలమైన వాణిజ్య సంబంధాలు నెలకొనే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో స్టార్మర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మయన్మార్ భూవిలయం..

# భారత్ మరింత సాయం

ఇటీవల భారీ భూకంపంతో మయన్మార్ అతలాకుతలమైంది. ముఖ్యంగా మాండలే, నేపిడాలో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ క్రమంలోనే సహాయక చర్యల విషయంలో ఇప్పటికే 'ఆపరేషన్ బ్రహ్మ'ను ప్రారంభించిన భారత్ తాజాగా మరింత సామగ్రిని భూకంప బాధిత దేశానికి తరలించింది. 31 టన్నుల సామగ్రితో కూడిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానం హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి మయన్మార్‌కు బయల్దేరింది. విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.



"ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా 31 టన్నుల మానవతా సాయంతో కూడిన సీ-17 వాయుసేన విమానం మయన్మార్‌కు బయల్దేరింది. మాండలేలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భారత ఆర్మీ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని కూడా అక్కడికి చేరవేశాం" అని జైశంకర్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా.. భారత సైన్యం ఆధ్వర్యంలోని ఫీల్డ్ ఆస్పత్రి భూకంప క్షతగాత్రులకు తన సేవలను కొనసాగిస్తోంది. మొత్తం 118 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు.. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సైతం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి.

గతనెల 28 నాటి భూకంపం దెబ్బకు మయన్మార్ కుదేలైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా మృతి చెందినవారి సంఖ్య 3 వేలు దాటేసింది. ఈక్రమంలో సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకువచ్చాయి. భారత్ 'ఆపరేషన్ బ్రహ్మ' పేరుతో పెద్దఎత్తున మానవతా సాయాన్ని పంపిస్తోంది. ఇందులో భాగంగానే భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్‌ఎస్ ఘరియాల్' వందల టన్నుల ఆహారాన్ని శనివారం తిలావా ఓడరేవుకు చేర్చింది. మరోవైపు క్వాడ్ దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్‌లు మయన్మార్‌ను ఆదుకునేందుకు శుక్రవారం 20 మిలియన్ డాలర్ల మానవతా సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# బలమైన దేశం కానీ పేలవ స్పందన..

# యూఎస్ ఎంబసీపై జెలెన్‌స్కీ మండిపాటు

**ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రైవీరిపై శుక్రవారం రష్యా క్షిపణి దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఆట స్థలం సమీపంలో జరిగిన ఈ దాడుల్లో తొమ్మిది మంది చిన్నారులు సహా మొత్తం 18 మంది మరణించారు. ఈ ఘటనపై ఉక్రెయిన్‌లోని అమెరికా రాయబార కార్యాలయం స్పందించిన తీరుపై జెలెన్‌స్కీ అసహనం వ్యక్తం చేశారు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ భావోద్వేగ పోస్టు పెట్టారు.**

ఉక్రెయిన్‌లోని అమెరికా రాయబారి బ్రిడ్జెట్ బ్రింక్ క్రైవీరిలో జరిగిన దాడిపై ఒక పోస్టు పెట్టారు. ఆటస్థలంలో జరిగిన దాడి తనను భయాందోళనకు గురిచేసిందన్నారు. అందుకే త్వరగా యుద్ధం ముగించాలని పిలుపునిచ్చారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందించారు. "క్రైవీరిపై జరిగిన దాడి విషయంలో అమెరికన్ ఎంబసీ స్పందన పేలవంగా ఉంది. అంత పెద్ద దేశం ఇలాంటి బలహీన ప్రకటన చేయడం ఆశ్చర్యంగా ఉంది. చిన్నారులను చంపిన క్షిపణి గురించి మాట్లాడేటప్పుడు వారు 'రష్యన్' అనే పదాన్ని చెప్పడానికి కూడా భయపడుతున్నారు. యుద్ధం ముగియాలి. అయితే



ఈ ఉద్రిక్తతలను ముగించాలనే ఉద్దేశం రష్యాకు లేదు. కాల్పుల విరమణను కాకుండా చిన్నారుల ప్రాణాలు తీయడాన్ని మాస్కో ఎంచుకుంటోంది. అందుకే ఆ దేశంపై పూర్తిస్థాయి ఒత్తిడి తీసుకురావాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దాడిపై జపాన్, స్విట్జర్లాండ్ దేశాల రాయబార కార్యాలయాలు స్పందించిన తీరును జెలెన్‌స్కీ ప్రశంసించారు.

### 18కి పెరిగిన మృతుల సంఖ్య

క్రైవీరిపై జరిగిన దాడిలో 18మంది మృతి చెందగా.. 72 మంది గాయపడ్డారు. ఇటీవలి వారాల్లో జరిగిన దాడుల్లో తాజా దాడి అత్యంత ఘోరమైనదిగా ఉక్రెయిన్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఇంధన సౌకర్యాలున్న నేపథ్యంలో రష్యా ఉద్దేశపూర్వకంగానే దాడి చేసిందని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈ చర్యతో అమెరికాతో మాస్కో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని విస్మరించిందన్నారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు కృషి చేస్తామని రష్యన్లు చేసిన వాగ్దానాలు ఈ దాడులతో ముగిశాయని వ్యాఖ్యానించారు. తమతో జరుగుతున్న యుద్ధాన్ని ముగించే ఉద్దేశం రష్యాకు లేదనే విషయం ప్రపంచానికి అర్థమవుతోందన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యా అధినేత పుతిన్‌తో ఫోన్‌లో జరిపిన చర్చల్లో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. యుద్ధాన్ని ఆపడంలో భాగంగా ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజుల పాటు దాడులు నిలిపివేసేలా చూడాలని అమెరికా, రష్యా ఒప్పందం చేసుకున్నాయి. దీనికి పుతిన్ అంగీకరించారని, శాంతి దిశగా ఇది తొలిఅడుగు అని అమెరికా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. నల్ల సముద్రంలో దాడుల విరమణకు, ఆ తర్వాత పూర్తిగా యుద్ధం అంతానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది.

# బెస్ట్ ఫినిషర్ కాదు..

## జట్టు పాలిట విలన్‌లా మారిన ధోని..

### తొలి బౌండరీతో చెత్త రికార్డ్..

**ఐపీఎల్ 2025లో భాగంగా జరిగిన 17వలో చెన్నై జట్టుకు మరో ఓటమి ఎదురైంది. చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో 25 పరుగుల తేడాతో సీఎస్‌కే జట్టు ఓటమిపాలైంది. ఛేజింగ్‌లో కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయినప్పటికీ, చెన్నై జట్టు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో వరుసగా మూడో ఓటమిని ఖాతాలో వేసుకుంది.**



**పడిపోయిన ధోని బ్యాటింగ్..**

మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 183 పరుగులు చేసింది. 11వ ఓవర్ సమయానికి చెన్నై జట్టు 5 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. లక్ష్యాన్నిసాధించే ఛాన్స్ ఉంది. కానీ, ధోని, విజయ్ శంకర్ మాత్రం టెస్ట్ బ్యాటింగ్‌తో చిరాకు తెప్పించారు. ధోని తన మొదటి బౌండరీని కొట్టడానికి ఏకంగా 19 బంతులు తీసుకున్నాడు. 18వ ఓవర్లో ముఖేష్ కుమార్ బౌలింగ్‌లో ఒక సిక్స్ కొట్టాడు.

ఐపీఎల్ 2025లో ఒక బ్యాటర్ తన తొలి బౌండరీ కొట్టడానికి తీసుకున్న అత్యధిక బంతులు ఇవే కావడం గమనార్హం. మొత్తంగా 26 బంతుల్లో కేవలం 30 పరుగులు మాత్రమే చేశాడు. ధోని తన ఇన్నింగ్స్‌లో ఒక సిక్స్, ఒక ఫోర్ మాత్రమే బాదాడు. చివరి ఓవర్లలో దూకుడైన బ్యాటింగ్‌తో ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్న ధోని.. ఈమ్యాచ్‌లో టెస్ట్ బ్యాటింగ్‌తో నిరాశపరిచాడు. మరోవైపు విజయ్ శంకర్ 54 బంతుల్లో 69 పరుగులు చేశాడు. దీంతో చెన్నై ఆట పట్ల అన్నివైపుల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి.

మొత్తం మీద సీఎస్‌కే ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడింటిలో ఓడిపోయింది. %ఖూా% 2025లో ప్లేఆఫ్‌లకు చేరుకోవాలనుకుంటే ఇకపై వరుస విజయాలు నమోదు చేయాల్సిందే. లేదంటే ప్లేఆఫ్స్ చేరుకోకుండానే 18వ సీజన్ నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. మరోవైపు, ఢిల్లీ క్యాపిటల్స్ మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. కొత్త కెప్టెన్ అక్షర్ పటేల్ నాయకత్వంలో గొప్ప ఆరంభాన్ని సాధించాలని ఆశిస్తోంది.

# హ్యాట్రిక్ పరాజయాలు వర్సెస్ వరుస విజయాలు

## హైదరాబాద్ చూపంతా ఆ ఒక్కడిపైనే?

**ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా 19వ మ్యాచ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. ఏప్రిల్ 6న జరగనున్న ఈ మ్యాచ్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు మొదలుకానుంది. విజయంతో ఐపీఎల్ 2025 సీజన్ ఆరంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. దీంతో పాయింట్ల పట్టికలో అట్టడుగున, అంటే 2 పాయింట్లతో 10వ స్థానంలో నిలిచింది. మరోవైపు, తొలి ఓటమి తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో టాప్-5లో నిలిచింది. ఇటువంటి సందర్భంలో, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ సొంత మైదానంలో అద్భుతంగా ప్రదర్శన ఇవ్వడం ద్వారా ట్రాక్‌లోకి తిరిగి రావాలని కోరుకుంటుండగా, గుజరాత్ టైటాన్స్ తమ విజయ పరంపరను కొనసాగించాలని కోరుకుంటోంది.**




కోల్‌కతాతో జరిగిన గత మ్యాచ్‌లో మొహమ్మద్ షమీ తొలి ఓవర్‌లోనే వికెట్ తీసి హైదరాబాద్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. దీంతో ఈసారి కూడా షమీ నుంచి భారీ అంచనాలను మేనేజ్‌మెంట్ కలిగి ఉంటుంది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, జోస్ బట్లర్‌లపై షమీ టీ20ల్లో అద్భుతమైన గణాంకాలను కలిగి ఉన్నాడు. షమీ ఐదు ఇన్నింగ్స్‌లలో రెండుసార్లు గిల్‌ను అవుట్ చేయగా, ఈ కాలంలో గిల్ 114 స్ట్రైక్ రేట్‌తో షమీ బౌలింగ్‌లో 41 పరుగులు మాత్రమే చేయగలిగాడు. షమీ 13 ఇన్నింగ్స్‌లలో బట్లర్‌ను మూడుసార్లు అవుట్ చేయగా, బట్లర్ 134 స్ట్రైక్ రేట్‌తో అతనిపై 107 పరుగులు చేశాడు.

**పవర్‌ప్లేలో హైదరాబాద్ పేలవ ప్రదర్శన..**

తొలి మ్యాచ్ తర్వాత హైదరాబాద్ టాప్ ఆర్డర్ వరుసగా విఫలమవుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు కోల్పోయిన జట్టుగా హైదరాబాద్ నిలిచింది. అంటే ఇప్పటి వరకు జరిగిన 4 మ్యాచ్‌ల్లో హైదరాబాద్ జట్టు పవర్ ప్లేలో 10 వికెట్లు కోల్పోయింది. ఓపెనింగ్ జోడీ ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ గత సీజన్‌తో పోలిస్తే సగటు భారీగా తగ్గింది. హెడ్, అభిషేక్ జోడీ 49.9 సగటుతో పరుగులు సాధించగా, ఈ సీజన్‌లో ఈ జోడీ కేవలం 18.8 సగటుతో చెత్త రికార్డును సొంతం చేసుకుంది. ఇటువంటి పరిస్థితిలో, హెడ్, అభిషేక్ జోడీ త్వరలోనే తమ పాత ఫాంలోకి తిరిగా రావాలని కోరుకుంటోంది.

# 18వ సీజన్‌తో పంజాబ్‌కు తొలి ఓటమి..

## గాడినపడ్డ రాజస్థాన్

**ఐపీఎల్ 2025లో భాగంగా 18వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పంజాబ్ కింగ్స్‌ను 50 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో రాజస్థాన్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం సాధించగా, పంజాబ్ ఈ సీజన్‌లో తొలిసారి ఓడిపోయింది.**



శనివారం ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ క్రికెట్ స్టేడియంలో 206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బరిలోకి దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. నేహాల్ వధేరా 41 బంతుల్లో 62 పరుగులు చేశాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (30 పరుగులు) తో కలిసి 88 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కానీ, జట్టును విజయపథంలో నడిపించలేకపోయాడు. జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు పడగొట్టాడు. సందీప్ శర్మ, మహేష్ తీక్షణా చెరో 2 వికెట్లు పడగొట్టారు. టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 45 బంతుల్లో 67 పరుగులు, రియాన్ పరాగ్ 25 బంతుల్లో 43 నాటౌట్, కెప్టెన్ సంజు శాంసన్ 26 బంతుల్లో 38 పరుగులు సాధించారు.

**● ధోని ఫ్యాన్స్‌కు బ్యాడ్‌న్యూస్..**

# ప్లేఆఫ్స్ నుంచి చెన్నై ఔట్.. షాకిస్తోన్న సమీకరణాలు?



**ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ టీం చెన్నై సూపర్ కింగ్స్ IPL 2025లో ఆశించిన విధంగా ఆడలేకపోతోంది. నాల్గవ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఆ జట్టు 25 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ విధంగా చెన్నై మొదటి నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో ఓడిపోయింది. ఆ చెన్నై జట్టు ఇంకా ప్లేఆఫ్స్‌కు చేరుకోగలదా అని క్రికెట్ అభిమానుల మనస్సులలో ఒక ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే, ప్రస్తుత ఆటతీరును చూస్తుంటే చెన్నై ప్లేఆఫ్ ఆశలు చాలా తక్కువగా ఉన్నాయి.**

ముంబై ఇండియన్స్‌పై 4 వికెట్ల విజయంతో చెన్నై ఈ సీజన్‌ను ప్రారంభించింది. కానీ, తర్వాతి మూడు మ్యాచ్‌ల్లో ఓటమిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఎవరు ఊహించలేదు. కాగితంపై బలంగా కనిపించిన ఈ జట్టును రాయల్ చాలెంజర్స్, రాజస్థాన్ రాయల్స్, ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఓడించాయి. దీంతో చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడం కష్టంగా కనిపిస్తోంది.

**చెన్నై ఇప్పటికీ టాప్ 4లో స్థానం సంపాదించగలదా?**

ప్రస్తుత పరిస్థితి ప్రకారం చెన్నై సూపర్ కింగ్స్ పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఐపీఎల్ లీగ్ దశలో ఒక జట్టు 14 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. అంటే చెన్నైకి ఇంకా 10 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్లేఆఫ్ అర్హత గురించి మాట్లాడుకుంటే, మునుపటి సీజన్ల ప్రకారం, ప్లేఆఫ్ టికెట్ పొందడానికి ఒక జట్టు కనీసం 7 లేదా 8 మ్యాచ్‌లను గెలవాల్సి ఉంటుంది. దీని అర్థం చెన్నై తన ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే మిగిలిన 10 మ్యాచ్‌లలో కనీసం 6 లేదా 7 గెలవాలి.

# ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 4 లైఫ్‌లైన్‌లు!



**ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ %జం% ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో విజయ్ శంకర్ అదృష్టం పరాకాష్టకు చేరుకుంది. శనివారం సాయంత్రం జరిగిన ఈ పోరులో శంకర్ నానా తప్పిదాల మధ్య కూడా క్రీజ్‌లో నిలవడం క్రికెట్ అభిమానుల మతులు పోగొట్టేలా చేసింది. మొదట మిచెల్ స్టార్క్ వేసిన బంతికి శంకర్ ముందు నుంచి ప్లంబ్ అయినట్లు కనిపించినా అంపైర్ నాటౌట్ గా ప్రకటించడంతో డీసీని అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ కెప్టెన్ %ణ=ూ% కూడా వారి దురదృష్టాన్ని తేటతెల్లం చేసింది.**

అంతే కాదు, ఆ తర్వాత గోల్డెన్ రనౌట్ అవకాశం వచ్చింది దాన్ని డీసీ మిస్ చేసింది. అదికాకుండా శంకర్ రెండు కీలక క్యాచ్‌ల నుంచి కూడా తప్పించుకున్నాడు. మొదట కుల్దీప్ యాదవ్ ఒక క్యాచ్ వదిలేశాడు, తర్వాత ట్రిస్టన్ స్టబ్స్ మరో క్యాచ్‌ను డ్రాప్ చేశాడు. దీంతో శంకర్‌కు ఒకటి కాదు నాలుగు లైఫ్‌లైన్‌లు లభించాయి. ఈ సంఘటనలన్నీ శంకర్‌ను "లక్కీ బాయ్"గా మార్చేయగా, సోషల్ మీడియా వేదికగా అభిమానుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది.

ట్విట్టర్‌లో చాలా మంది వినోదభరితమైన సూచనతో, "డీసీ ఉద్దేశంగా శంకర్‌ను ఔట్ చేయడంలేదు" అంటూ విమర్శలు గుప్పించారు. మరికొందరు "%జూఖ% మిడిల్ ఆర్డర్‌ని కవర్ చేయడానికే శంకర్ ఇలా లైఫ్‌లైన్‌లు పొందాడు" అంటూ ట్రోల్స్‌కు తెరతీశారు. క్రికెట్ విశ్లేషకులు ఈ మ్యాచ్‌ను "శంకర్ గ్రేట్ ఎస్కేప్స్" అనే పేరుతో పిలుస్తూ చమత్కరించారు.

క్రికెట్‌లో అదృష్టం ఎలా పనిచేస్తుందో ఈ మ్యాచ్‌లో మరోసారి రుజువు చేసింది. సాధారణంగా ఒక ప్లేయర్‌కు ఒక అవకాశం రావడమే అరుదైతే, శంకర్‌కు నాలుగు లైఫ్‌లైన్‌లు రావడం అత్యాశ్చర్యంగా. అభిమానుల కన్నా ముందు దేవతలే అతని క్రీజ్‌ను కాపాడినట్లుగా కనిపించింది. ఈ సంఘటనలన్నీ కలిసి మ్యాచ్, ముగిసిన తర్వాత సోషల్ మీడియాలో శంకర్ పేరు హాట్ టాపిక్‌గా మారిపోయింది.

ఐపీఎల్ 2025లో శనివారం చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకోగా, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ కేఎల్ రాహుల్ అద్భుతంగా ఆడి 51 బంతుల్లో 77 పరుగులు చేశాడు. అతనికి సహాయంగా అభిషేక్ పోరెల్ 33 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 24 నాటౌట్, సమీర్ రిజ్వీ 20 పరుగులు చేశారు. చెన్నై బౌలింగ్ విభాగంలో ఖలీల్ అహ్మద్ రెండు కీలక వికెట్లు తీసి రాణించాడు.

లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ 184 పరుగుల కోసం బరిలోకి దిగగా, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 158 పరుగులు చేయగలిగింది. విజయ్ శంకర్ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన ఎంఎస్ ధోని తన దూకుడుతో అభిమానులను అలరించాడు. ఆయన 30 పరుగులతో అజేయంగా మిగిలాడు. అయితే, ఈ ఇద్దరి ఒత్తిడిని తట్టుకునే పోరాటం చాలినంతగా కాకపోవడంతో చెన్నై జట్టు విజయం దక్కించుకోలేకపోయింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



## ఇన్‌స్టాలో సాయిపల్లవి క్రేజ్ మామూలుగా లేదుగా.. ధోని, విజయ్ కూడా ఆమె ముందు దిగదుడుపే!

టాలీవుడ్ లో అత్యంత పాపులర్ హీరోయిన్ సాయిపల్లవికి సోషల్ మీడియాలో ఫాలోయింగ్ ఓ రేంజ్ లో ఉంది. దేశవ్యాప్తంగా ఆమెకు అభిమానులు ఉన్నారు. సాయిపల్లవి హీరోయిన్ గా చేస్తోందంటే ఆ సినిమా సూపర్ హిట్ అని ఫిక్సవ్వాల్సిందే అనేంతగా పాపులర్ అయ్యారు. తాజాగా సాయిపల్లవి భారతదేశంలోనే టాప్ మోస్ట్ సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్షియల్ సెలబ్రిటీగా నిలిచినట్లు సమాచారం. టీమిండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోని, హీరో విజయ్ తదితరులను వెనక్కి నెట్టి సాయిపల్లవి ఈ ఘనత సాధించారు. ఇన్ స్టాలో సాయి పల్లవికి సంబంధించిన విషయాలను తెలుసుకోవడానికి 25 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారట. ఇప్పటి వరకు ఏ హీరోయిన్ కూడా ఈ ఘనత అందుకోలేదని, ఇది కేవలం సాయి పల్లవికే సొంతమని ఆమె అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో హీరో విజయ్ 20 శాతం జనాలను ప్రభావితం చేస్తుండగా, ధోని 17 శాతం మందిని ప్రభావితం చేస్తున్నట్లు చెబుతున్నారు. మిగిలిన సెలబ్రిటీలలో 5 శాతం వరకు సోషల్ మీడియాలో జనాలను ప్రభావితం చేస్తున్నారట.



## పవర్‌ఫుల్ షాట్ లాంటి 'పెద్ది' గ్లింప్స్




గ్లోబల్ సూపర్‌స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్ర గ్లింప్స్ మేకర్స్ విడుదల చేశారు. ఫస్ట్ షాట్ గ్లింప్స్ అదిరిపోయింది. ఇందులో ఏఆర్ రెహమాన్ సంగీతం దుమ్ముదులిపేలా ఉంది. దీనికి తోడు ఈ వీడియోలో మాస్ గెటప్ లో కనిపించిన రామ్ చరణ్ గ్లిప్స్ చూస్తే విజిల్స్ వేయక మానరు. 'ఏదైనా నేలమీద ఉన్నప్పుడే చేసేయ్యాలి.. పుడాతామా ఏంటి మళ్లీ%ా%' అంటూ చెప్పే డైలాగ్ ఊరమాస్ లెక్క. ఈ క్రమంలో సాగే ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ గూస్ బమ్స్ తెప్పించాయి. క్రికెట్ ఆడుతూ ఫ్రెంట్ ఫూట్ వేస్తూ%ా% బ్యాట్ ను నెలకు కొట్టి%ా% బంతిని గాల్లో కొట్టిన గ్లిప్స్ అదుర్స్ అంటూ సోషల్ మీడియాలో ప్రేక్షకులు సందడి చేస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కాగా ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న పెద్ది 2026 మార్చి 27న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది.

## శ్రీలీల చేయి పట్టుకుని గుంపులోకి లాగిన పోకిరీలు...

### డార్జిలింగ్‌లో శ్రీలీలకు చేదు అనుభవం
### ఆకతాయిల చర్యతో షాక్ తిన్న నటి
### సిబ్బంది సహాయంతో సురక్షితంగా బయటపడిన వైనం

సెలబ్రిటీలు సైతం కొన్నిసార్లు అభిమానుల అత్యుత్సాహానికి గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. తాజాగా, యువ హీరోయిన్ శ్రీలీలకు డార్జిలింగ్‌లో చేదు అనుభవం ఎదురైంది. షూటింగ్ ముగించుకుని తిరిగి వస్తుండగా కొందరు అభిమానులు ఆమెతో అనుచితంగా ప్రవర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల, కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్ బసు దర్శకత్వంలో ఒక ప్రేమ కథా చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ నిమిత్తం చిత్ర యూనిట్ డార్జిలింగ్‌కు వెళ్ళింది. షూటింగ్ అనంతరం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి శ్రీలీల తిరిగి వస్తుండగా అభిమానులు వారిని చుట్టుముట్టారు. కార్తీక్ ఆర్యన్ అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు వెళ్లగా, శ్రీలీల కూడా నవ్వుతూ ఆయనను అనుసరించారు. అయితే, గుంపులో ఉన్న కొందరు వ్యక్తులు శ్రీలీల చేయి పట్టుకుని లాగడంతో ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను వారి నుంచి విడిపించి సురక్షితంగా అక్కడి నుంచి తీసుకువెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు శ్రీలీల పట్ల జరిగిన ఈ ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నారు. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని, అభిమానులు హద్దులు మీరకుండా ప్రవర్తించాలని సూచిస్తున్నారు. అలాంటి ఆకతాయిలను దూరంగా ఉంచాలని స్పష్టం చేస్తున్నారు.








## బీచ్‌లో గుర్రంపై విజయ్ దేవరకొండ...

### చిల్లింగ్ ఫొటోలు వైరల్

టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ షూటింగ్ లేకపోతే ఫారెన్ డెస్టినేషన్లకు చెక్కేస్తాడని తెలిసిందే. ప్రస్తుతం, విజయ్ దేవరకొండ వీడీ12 (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్టుకు గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఇందులో భాగ్య శ్రీ భోర్సే కథానాయిక. ఈ సినిమా షూటింగ్ కు గ్యాప్ రావడంతో విజయ్ దేవరకొండ వెకేషన్ కు వెళ్లాడు. పైగా సమ్మర్ కావడంతో ఓ బీచ్ ఏరియాలో సేదదీరుతున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోలను విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియా అకౌంట్లో షేర్ చేశాడు. కాటన్ బ్యాగీ దుస్తుల్లో ఆరామ్ గా కనిపిస్తున్న ఈ యంగ్ హీరో... గుర్రంపై షికారు చేస్తూ చిల్ అవుతుండడాన్ని ఫొటోల్లో చూడొచ్చు. ఈ ఫొటోలకు అభిమానుల నుంచి విశేషమైన స్పందన వస్తోంది.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339